# బాంధవ్య బంధితులు

డా॥ మంతెన సూర్యనారాయణరాజు

గతాన్ని తల్చుకుంటూంటే బిందుకి ఒక కరిగిన కలలా అనిపించసాగింది. మధుచక్రవర్తితో ఆమె జీవితం పంచుకున్నది కేవలం ఐదు సంవత్సరాలు. రెండేళ్ళకే ఆమె కడుపు పండి జూనియర్ మధు పుట్టాడు. వాణ్ణి ముద్దుగా బొద్దుగా వున్నాడని అమూల్య చక్రవర్తి అని బెంగాలీ పేరులాంటిది పెట్టింది. భర్త తన తండ్రి జయచంద్ర చక్రవర్తి పేరు పెట్టాలన్నా బిందు వినిపించుకోలేదు.

పెద్ద పెద్ద పేర్లతో పిలవడం కుదరక ఆఖరికి 'చక్రి' అంటూ వాణ్ణి ఎంతో అల్లారు ముద్దుగా పెంచసాగింది. భర్త నుండి తాను విడిపోయి అప్పుడే ఏడు సంవత్సరాల కాలం పూర్తికావస్తోంది. బిందు ఉద్యోగం పెళ్ళికి ముందు నుంచే ఒక లిమిటెడ్ ఫర్మ్‌లో చేస్తూనే వుంది. ఆ ఉద్యోగం ఆమె తండ్రి ప్రాపకంతో వచ్చిందే! అదే శాఖకు చెందిన బ్రాంచి ఆఫీసు విజయవాడలో కూడా వున్నందువల్ల అక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యాక మధుచక్రవర్తితో పరిచయం, అదే అతనితో పెళ్ళికి దారితీయడం జరిగింది.

పిల్లాడు పుట్టిన రెండో నెలలోనే హైద్రాబాద్ పాత ఆఫీసుకు తిరిగి ట్రాన్స్‌ఫరై వచ్చింది బిందు. చిన్న ప్రమోషన్ కూడా పొందింది. ఆమె హైదరాబాద్ వెళ్ళడం మధుకి ఇష్టంలేదు. అందుకే ఆ ఇద్దరిలో సఖ్యత చెడి పోవడానికి బీజావాపం జరిగింది.

భార్య హైదరాబాద్ వెళ్ళిపోగానే మధుచక్రవర్తి కొత్తగా ఆఫీసులో జాయిన్ అయిన మయూరితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అందుకు కారణాలు ప్రత్యేకంగా ఏమీలేవు. మనసులేని చోట కాపురం ఏం చేస్తానని ఆమె కోర్టును ఆశ్రయించి విడాకులు చట్టబద్ధంగా పొందింది. తండ్రిలాగే అమూల్య చక్రవర్తి అని పేరుపెట్టుకున్న కొడుకు చక్రి తండ్రిలాగే పెంకిఘటం. పన్నెండు సంవత్స రాలకే డిప్పకాయలాగ ఆరిందా కబుర్లు చెప్పేవాడు. తల్లి బిందు మాట పెడచెవినిబెట్టి క్రికెట్ ఆడటానికి బ్యాట్ పుచ్చుకొని గ్రౌండ్‌కి, పార్కులకూ పరిగెడుతుండేవాడు. తల్లి ఎంత వద్దని మొత్తుకున్నా క్రైమ్ సినిమాలు చూడ్డం అందుకు పగలు రాత్రీ అనే తేడా కూడా పాటించక పోవడం జరుగుతుండేది. పట్టుదలకు పోతే తన పంతం నెగ్గేదాకా ఊరుకునేవాడు కాదు చక్రి. రోజు రోజుకూ వాడి ఆగడాల్ని బిందు భరించలేకపోయేది. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు ఆమె తల్లిదండ్రులు తీర్థ యాత్రలకెళ్ళి బస్సు యాక్సిడెంట్లో చనిపోయారు. ఇప్పుడామెది ఒంటరి జీవితగమనం.

కొడుకు చక్రే జీవిత సర్వస్వం అనుకొనే పరిస్థితి ఏర్పడింది. ఆటపాటల్లో మిగిలిన సావాసగాళ్ళతో గొడవలు, కొట్లాటలు, వాటితో బిందుకు మనశ్శాంతి కరువయ్యింది. ఆమె వయస్సు ముప్పై ఐదు సంవత్సరాలకు వచ్చేసింది. అక్కడక్కడా తలలో నెరసిన వెంట్రుకలు పెరిగే వయస్సును గుర్తుచేస్తున్నాయి. మగతోడు లేని మోడులాంటి బ్రతుకనిపిస్తోంది రోజు రోజుకూ బిందుకు.

పెందరాళే లేవడం వంటా వార్పు ముగించుకొని బట్టలు ఉతుక్కుని,చక్రిని రెడీ చేసి, తనూ తయారై టిఫిన్ బాక్సులు సర్దిపెట్టుకుని స్కూటీమీద వాణ్ణి కాన్వెంటు దగ్గర దింపి, ఆఫీసుకుపోయేది బిందు. ఆమెకు ఎందుకో లైఫ్ చాలా బోర్‌గా నిస్సారంగా అనిపించసాగింది. ఈ వయస్సులో పెళ్ళి చేసుకుంటే అనే ఆలోచన వచ్చింది. అందుకిప్పుడైతే చక్రి ప్రతిబంధకంగా ఉన్నాడు. తాను బిడ్డతల్లినని తెలిస్తే తనని పెళ్ళిచేసుకోవడానికి ఎవరు ముందుకొస్తారు. ఒకవేళ చేసుకున్నా వాడిని ఆదరిస్తారా అనే సవాలక్ష ప్రశ్నలు బిందును కలవర పరిచాయి. చక్రి పోనీ బుద్ధిమంతుడా అంటే రోజూ ఏదో తగవు కొంప మీదకు తెస్తూనే వుంటాడాయె. దూరంగా ఎక్కడన్నా రెసిడెన్షియల్ స్కూల్లో వేయిద్దామనే ప్రయత్నం చేయ సాగింది.

ఆ విషయం క్రిమినల్ బుర్రగల చక్రి ఎలా గ్రహించాడో ఏమో నేను వేరే ఎక్కడో రెసిడెన్షియల్ స్కూల్లో జేరను. క్రికెట్‌లో గొప్ప ప్లేయర్‌ని కావాలనే నా కోరిక తీర్చుకుంటానిక్కడే అని తల్లితో గట్టిగా చెప్పేశాడు. ఆదిలోనే హంస పాదన్నట్టు కొడుకు మొండి వైఖరి ఆమెను ఇబ్బంది పెట్టింది. ఒకరోజు రాత్రి టి.విలో ఏదో హర్రర్ పిక్చర్ చూస్తోంది బిందు. అప్పటిదాకా సోఫాలో నిద్రపోతూ కునుకు తీస్తున్న చక్రి దోమలు కుట్టి లేచాడు. ఏదో గుర్తుకొచ్చినట్లు క్రైమ్ పిక్చరొచ్చే ఛానల్‌కి రిమోట్ నొక్కి మార్చాడు. రిమోట్ ఐదారుసార్లు తల్లి నుండి కొడుక్కి కొడుకు నుంచి తల్లికి ఛానల్స్ మార్పులతో ఆవేశకావేశాలు పెరిగాయి. చిర్రెత్తుకొచ్చి రిమోట్ లాక్కుని తన ఛానల్ పెట్టుకొని దాన్ని అసహనంగా నేలకేసి కొట్టింది. చక్రి దూరంగా వున్న క్రికెట్‌బాల్ అందిపుచ్చుకొని బిందు గుండెలకేసి గట్టిగా కొట్టాడు. ఆమె కెవ్వున కేకవేసి పడిపోయింది. చుట్టుపక్కల వాళ్ళొచ్చేలోపల వెంటిలేటర్ నుంచి దూకి పెరట్లోకి పారిపోయాడు చక్రి.

పక్కింటివాళ్ళు పరిగెట్టుకొచ్చి బిందుని ఆసుపత్రిలో చేర్పించారు. వారం రోజులు ఐ.సి.యులో పెట్టాక ఆమె గుండె కండిషన్ గాడిలో పడిందని చెప్పి డిస్చార్జ్ చేసి బిందును ఇంటికి పంపేశారు. కొడుకు ఆచూకీ తీసి అరెస్టు చేసి ఏ బోస్టన్ స్కూల్లోనైనా పడేయండని, కేస్ ఫైల్ చేయమని వాడి ఫోటో ఒకటి పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు అందించింది. ఎలాగైతే ఫోటో ఆధారంగా చక్రిని అరెస్టు చేసి, తల్లిని చంపబోయినందుకు కేస్ పెట్టిన కారణంగా బోస్టన్ స్కూల్లో పడేశారు. ఒకసారి బిందు వాణ్ణి చూసేందుకు వెళితే తల్లిని రాక్షసి, భూతం, పిశాచి అని తిట్టిపోశాడు. క్రూరమైన చూపులు చూస్తూ తల్లితో నీ అంతు చూస్తానన్నాడు. వాడి ముఖం ఎర్రబారిపోయింది. సెక్యూరిటీ చక్రిని లోనికి తీసుకు చక్కాపోయారు.

❖ ❖ ❖

తల్లిదండ్రులు పోట్లాడుకుని విడిపోవడంవల్లకూడా కొంతవరకూ పిల్లలు అతిగారంగా పెంచబడి సోమ రులు, బాధ్యతలేని వారుగా తయారయ్యే అవకాశం లేక పోలేదు. అదీగాక అటువంటి పిల్లలు భవిష్యత్తులో ఏ చిన్న సమస్యనీ తట్టుకోలేరు. అందునా సున్నిత స్వభావు లైతే యాంగ్జయిటీ, డిప్రెషన్‌లకు లోనై ఏకాగ్రతను కోల్పోవడం మనం గమనిస్తుంటాం.

ఇంకా తల్లిదండ్రులు ఎవరి పనుల్లో వారు అలసి సొలసి చికాకు చూపడంవల్ల, జీవిత భాగస్వామి ప్రవర్తన వల్ల అసంతృప్తి కావచ్చును. కారణాలెటువంటివైనా గొడవలు పిల్లలు మానసిక ఎదుగుదలకు హాని చేస్తాయన్నది నిజం. ఇది చైల్డ్ సైకాలజీ! బహుశా అదే మొద ట్నుంచీ చక్రికి అబ్బిందని చెప్పవచ్చు. పులిమీద పుట్రలా చక్రి చదివే బోస్టన్ స్కూల్లో అతనికి మరో నేరస్థుడైన బాలఖైదీకి గొడవలు జరిగి చక్రి పాత్ర కూడా ఉండ టంతో ఆ కుర్రాడు చనిపోయాడు. కోర్టుకెళ్ళిన కొత్త కేసు మోపై చక్రికి కూడా శిక్ష మరికొంత పెరిగింది.

కన్నపేగు బంధంతో బిందు కొడుక్కి తినుబండారాలు, బిస్కెట్లు వగైరాలు తీస్కెళ్ళి ఇవ్వబోయింది. నువ్వెవరో నాకు తెలీదు.నన్ను యావజ్జీవ ముద్దాయి చేద్దామని చూస్తున్నావు నువ్వు. నాకు తల్లిదండ్రులు చిన్నప్పుడే చచ్చిపోయారనేశాడు. ఆ ముక్కలు విని తట్టుకుని తమాయించుకోలేక ఇంటికొచ్చి బిందు మంచంమీద

## భారతీయత తెగులు

సామాన్యులు
పని మనుష్యులుగా
యజమాని దౌర్జన్యానికి
బలిపశువులుగా
గల్ఫ్ దేశాలలో తెలుగువారు
దయనీయ పరిస్థితులతో
నరకం చవిచూస్తున్నారు.
తెల్లారిపోతున్న వారి బ్రతుకు తెరువులు
చీకటికడువున నలువు జీవులుగా
నిరుజీవులై కరువు కాటకాల్లో నలుసులవుతున్నారు
నిజానికి ఆంధ్రులు అభిమానధనులైనా
దూర తీర ప్రాంతం సముద్రం అలల్లో
కరిగిపోతున్నారు
ఈ దుస్థితుల నుంచి మన ప్రభుత్వం
చేయూతనిచ్చి ఆదుకుంటే బ్రతుకుతారు కాదా!!
ఇక్కడా అక్కడా దిక్కుతోచకనే
కంట్రాక్టు వలల్లో చిక్కుకుని
తప్పుతప్పులకు తలవంచి
వేలకు వేలు ఖర్చులు భరించి
దూరపుకొండలకు ఆశతో పరిగెత్తి
మంచినీళ్ళుకూడా లభించని పరిస్థితికి వగచీ
చావలేక బ్రతకలేక తనవారికోసం
అప్పిచ్చిన వారి క్షేమంకోసం క్షామంలో నలిగే
తెలిసీ తెలియని అభాగ్యులై కుమిలీ కృషించీ
చివరికి శవాలుగా కూడా మారి
ఇంటి త్రోవపట్టి వేదన రోదనలకు వీళ్ళను
కన్నీళ్ళ ప్రవాహంలో దొర్లేట్లు చేస్తున్నారు!
ఇంత దీన స్థితిగతులకు కారకులెవరైనా గానీ
ముందు జాగ్రత్తకోసం మన ప్రభుత్వం
వాళ్ళ సంక్షేమం కోసం కృషి చేస్తే...
ఈ వలస జీవులకు ఆధరణ లభిస్తే...
కొంత మేలు చేసి సహాయం అందిస్తే...
విదేశీయులకు మనం లోకువ కాకుండాపోతాము
భారతీయత తెగులు పట్టకుండా క్షేమంతో
లాభం పొంది సంతృప్తి పొందుతాము కదా!

ఎస్. జగన్మాధవరావు

పడుకుని కుళ్ళికుళ్ళి ఏడ్చింది. ఆ తర్వాత కొడుకుమీద ఆశలు వదిలేసుకుంది.

ఆమె పనిచేసేఆఫీసుటైమింగ్స్ మారాయి. బిందు కొలీగ్ సరళకు దూరపు చుట్టం యతిరాజులనే వ్యక్తి భార్య పోయి ఏడాదయ్యింది. అతనికి పిల్లాపాలంటూ ఎవరూ లేరు. తిండీ తిప్పలు సరిలేక పెళ్ళి చేసుకుందామని వుందని సరళచెవిలో ఊదాడు యతిరాజులు.మీ ఫ్రెండు బిందు చట్టరీత్యా డైవర్స్ తీసుకున్నదిగదా! ఆమెను చేసుకోవడానికి నాకైతే అభ్యంతరం లేదు. ఒకసారి అడిగి చూడు అంటూ ఆ బాధ్యత సరళమీద పెట్టాడు.

సరళ మంచి మాటకారి. ఎలాగైతే ఆమె పదే పదే యతిరాజులు గురించి చెప్పగా చెవికెక్కినట్టుంది. బిందు వయసు గుర్తుచేస్తూ ఆడదానికి జీవితాంతం ఒక మగతోడుంటే మంచిది. ఎన్నాళ్ళిలా మోడులా జీవిస్తావు. యతిరాజులు నీకన్నా రెండేళ్ళు మాత్రమే పెద్ద. నా మాట విని అతగాడిని పెండ్లాడి సుఖపడు అని హితోపదేశం చేసింది. స్నేహితురాలి మాటలకుబిందు మౌనంగా వుండి పోయింది. అవుననలేదు, కాదనలేదు.

బిందు మౌనం అర్థాంగీకారం అనుకుని సరళ ఆనందించింది. కొద్దిమంది ఆఫీసు స్టాఫ్‌రాగా స్థానికంగా వున్న గుళ్ళో సింపుల్‌గా యతిరాజులతో ఆమె పెళ్ళి శాస్త్రీయంగా జరిగిపోయింది. బిందు పనిచేస్తున్న ఆఫీసులో పనిచేసే ఒక సీనియర్ మోస్ట్‌లేడీ అటెండర్ ఉంది. ఆమె యతిరాజులు గురించి కొద్దిగా తెలుసు. బిందు తన సీట్లో టీ తాగుతుండగా వచ్చి ''బిందమ్మా...! నీ మొగుడు ముందు పెళ్ళాన్ని సంపిండట. జర... జాగర్తగుండు మళ్ళా! నేను ఈ మాట నీతో అన్నట్లు ఆనికిగాని, సరళకు గాని చెప్పకు'' అంది.

వయసులో తనకన్నా చాలా పెద్దదైనందువల్ల ఆమె మాటలు విని ఊరుకుంది బిందు. ఇద్దరివీ రెండు వైవిధ్య భరితమైన కథలు. అతడు సవ్యంగా వుంటే తను సవ్యంగా ఉంటుంది. లేదా ఎవరి దారి వారికి ఉండనే ఉంది అని తనలో అనుకుంది. పెళ్ళికి ముందే సరళతో నా సంపాదనమీద అతని అజమాయిషీ నేను సహించనని కండిషన్ పెట్టింది బిందు. అందుకు యతిరాజులు వచ్చి నట్టు అంగీకరించాడు. అదే సమయంలో నా గత చరిత్రను ఎట్టి పరిస్థితుల్లో తిరగదోడకూడదు. అతని గత చరిత్రతో నాకెటువంటి పట్టింపూలేదు అని పెళ్ళికి ముందే చెప్పేసింది. అందువల్ల ఎవరికీ ఎటువంటి ఆక్షేపణలూ తలెత్తలేదు.

ఏడాది తిరిగేటప్పటికి బిందు గర్భవతైంది. మరో తొమ్మిది నెలలు గడిచేటప్పటికి ఇద్దరు కవలలైన ఆడబిడ్డలకు మాతృమూర్తి అయ్యింది. కవలలు పుట్టడంతో యతిరాజులు కంగారుపడి ఫ్యామిలీప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుందామని తనే వెసక్టమీకి రెడీ అయ్యాడు. అందుకు గాను రెండు అడిషనల్ ఇంక్రిమెంట్లు పొందాడు. ఒక పక్క పతిసేవ, మరోపక్క ఇద్దరాడబిడ్డ లకు నీళ్ళుపోయడం, పాలు పట్టడం, ఆలనా పాలనా చూడ్డం మరో పక్క ఆఫీసు వర్క్ బిందుకి ఒక్కోణం తీరికలేకుండా తయారై కష్టం ఉంది.

ప్రసవానికి ముందూ, వెనకా కలిసి మూడు నెలల మెటర్నిటీ లీవు దక్కినా, రాను రాను నీరసం అదీ గుండె నీరసంగా మారింది. ముందు భర్త చక్రవర్తి ద్వారా కన్న సంతానం చక్రి కొట్టిన క్రికెట్ బాల్ దెబ్బ గుండెల్లో కలుక్కుమంటూ సలపరించసాగింది. పాతడాక్టర్‌కే వెళ్ళి చూపించుకుంటే మళ్ళీ అవే మందులు వాడమని సలహా ఇచ్చాడు.

గత్యంతరం లేక యతిరాజులు ముందు బిందు ఒక ఆయా కమ్ వంట మనిషిని పెట్టుకుందామనే ప్రపోజల్ వుంచింది. అతగాడు అందుకు ఒప్పుకోక తప్పింది కాదు. భార్య ఆ పరిస్థితుల్లో ఉద్యోగం మానేస్తే మళ్ళీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాలి. ఇద్దరాడబిడ్డల్ని సాకడం, పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించడం, తర్వాత పెళ్ళీ పేరంటాలు ఎలా జరిపించడం అనే దిగులు ఎక్కువయ్యింది. ముందు భార్య తన వల్లే చనిపోయింది. ఆమె పోయాక ఏడాదిపాటు తన బతుకు తెగిన గాలిపటం కన్నా హీనంగా తయారయ్యింది.సరళ పుణ్యమా అంటూ తానో ఇంటివాడయ్యాడు.ఇప్పుడు తెలిసి తెలిసి ఏ తప్పు చేయకూడదనుకున్నాడు. పిల్లలకీ తల్లిదండ్రుల రక్షణ పరిపూర్ణంగా కల్పించాలని కృత నిశ్చయంతో బాధ్యత కలిగి బ్రతుకీడుస్తున్నాడు యతిరాజులు నేడు.

❖ ❖ ❖

సోమవారం పొద్దున్నే పదిగంటలకు కొరియర్‌లో బిందు పేర కవర్ వచ్చింది. సంతకం పెట్టి అది తీసుకుంది. బొంబాయి నుండి వచ్చింది. తనకెవరూ బొంబాయిలో తెలుసున్నవాళ్ళు లేరే! ఆ ఉత్తరంలోని రైటింగ్ తనకు ఎప్పుడో పరిచయమైనదిలాగానే ఉంది. అందరూ వ్రాసినట్లుగా యోగక్షేమాల విచారణాంశాలు అందులో కనిపించలేదు. నన్ను కనిపారేసిన పాపానికి, అరెస్టు చేసి బోస్టన్ స్కూలుకి నెట్టించి నా బంగారు భవిష్యత్ నాశనా

నికి కారణమైన ఓ దౌర్భాగ్యపు తల్లీ! నేను బోస్టన్ స్కూల్లోనే చాలావరకు కంప్యూటర్ నేర్చుకున్నాను. జైలు నుండి విడుదలై ఈ మధ్యే కారు డ్రైవింగ్ బాగా నేర్చుకున్నాను. బొంబాయిలో అరబ్‌షేకులకు అమ్మాయిల్ని తార్చే బ్రోకర్ దగ్గర డ్రైవర్‌గా పనిచేసా! అందువల్ల డబ్బుకి పెద్దగా ఇబ్బందిపడటంలేదు.

అసలు విషయమేమిటంటే నా అదృష్టవశాత్తూ కంప్యూటర్ చాటింగ్ ద్వారా ఓ అమెరికా అమ్మాయిని ప్రేమించాను.ఆ అమ్మాయి నన్ను బాగా ఇష్టపడు తున్నట్లు మెసేజ్ ఇచ్చింది. నన్ను అక్కడికి రమ్మని చెబుతూ నీకు గ్రీన్‌కార్డు వచ్చేలా చేసి పర్మనెంటుగా తనతో ఉంచేసుకుంటానంటున్నది. అన్నట్టు అసలు విషయం చెప్పటం మరిచా! అదివరలో ఆమె రెండు పెళ్ళిళ్ళు చేసుకుంది. బోర్‌కొట్టి వాళ్ళని మధ్యలోనే వది లేసింది. ఆమె వయసు ఎంతనుకుంటున్నావ్ జస్ట్ నలభై దాటుతోంది. నాకా ఇరవై రెండు వెళ్ళి మూడులో ప్రవేశి స్తున్నా! నీ సుఖం నువ్వు చూసుకున్నావు, మరి నా సుఖం నేను చూసుకోవాలిగా! నీ రెండో మగడు నిన్ను బాగా చూసుకుంటున్నాడా! వద్దులే గతాన్ని తలవనిక. బతికి బాగుంటే ఎప్పుడన్నా కలుస్తా! అదీ నువ్వు నన్ను కన్న బంధంతో సుమా! ఇప్పటికి సెలవ్!

గుండెల్లో ఎవరో బిందుని అంకుశంతో పొడిచినంత బాధపడింది. భారంగా నిట్టూరుస్తూ కన్న పేగు బంధాన్ని వాడిలా తెంచేసుకుంటున్నాడా అంటూ రెండు కన్నీటి బొట్లు రాల్చింది. జీవిత సంధ్యాసమయంలోకి అడుగు పెడుతున్నట్టు బిందు కొడుకు క్రికెట్‌బాల్‌తో కొట్టిన దెబ్బ గుండె నీరసానికి దారితీయించింది. ఎక్స్‌పర్ట్ కార్డియాలజిస్ట్‌కి చూపించుకుంటే ఇటుపై బెడ్‌రెస్టే మీకు చాలా అవసరం అని చెప్పాడు. మందులవీ వ్రాసిచ్చి వాటిని క్రమం తప్పకుండా వాడమని సలహా ఇచ్చాడా కార్డియాలజిస్టు.

భర్త యతిరాజులుతో ఇంటికి తిరిగొచ్చాకా ఏవండీ నేను వి.ఆర్.ఎస్ తీసుకుందామనుకుంటున్నాను అని తన హృదయగత వేదనను చెప్పింది. వాలంటరీ తీసు కుంటే నీ ఆరోగ్యం కుదుటపడవచ్చును సరే! ఈ ఇద్ద రాడపిల్లలికీ చదువు సంధ్యలు,పెళ్ళీ పేరంటాలు గట్రా చేసి చెరో అయ్య కూడా పంపాలన్నా నాకు సెంటు ఆస్తి లేదు. బ్యాంకు బ్యాలెన్సు అంతంత మాత్రం అంటూ సన్నాయి నొక్కులు నొక్కాడు. యతిరాజులు స్వార్థబుద్ధికి లోలోపల బాధ పడింది. సరేలెండి వుంటే వుంటాను లేకుంటే చస్తాను. నా ఏడుపేదో నేనేడుస్తాను అటూ ఆ టాపిక్ గురించి మాట్లాడ్డం మానేసింది బిందు.

నానాటికీ బిందు ఆరోగ్యం పని ఒత్తిడివల్ల నీరసమల్లా నెప్పిగా మారి క్షీణించసాగింది. యతిరాజులుకి దిక్కు తోచడం లేదు.ఈమె చనిపోతే ఒకవేళ నా బతుకు యథా స్థితికి చేరుకుంటుంది. తిండీ తిప్పలు సరే సరి, కవల పిల్లలు చదువు సంధ్యలు ఏమైపోతాయి.

వాళ్ళకప్పడే 8 సంవత్స రాలు దాటిపోతున్నాయి. భార్య బిందు ముఖంలో మచ్చు కైనా పూర్వపు ఉత్సాహం, సంతోషాలు మృగ్యమయ్యాయి.

గుండె జబ్బు ముదిరి మనిషి ఆస్తిపంజరంలా తయారయ్యింది. విధిలేక యతిరాజులు బిందుతో వి.ఆర్.ఎస్ తీసేసుకో అన్నాడు. ఆమె అందుకు ఆనందంగా ఒప్పుకుంది. పేపర్ కరస్పాండెన్సులు వగైరాలు పరిసమాప్తమయ్యాయి. వచ్చిన గ్రాట్యుటీ, కమిటేసణ్ ఎమౌంట్స్ పిల్లలిద్దరి పేరా చెరో మూడేసి లక్షలూ వేసింది. భర్త రాబడితో తనకు పిక్సైన పెన్షన్‌తో వాళ్ళని చదివించసాగారు.

బలంకోసం పళ్ళరసాలవీ తీసుకోవడంవల్ల, వాకింగ్ వల్ల, మందులవల్ల బిందు ఆరోగ్యం కొంతలో కొంత బాగుపడిందనే చెప్పాలి. యతిరాజులు కూడా అదివర కట్లా జీతపు రాళ్ళను రేసులకు, పేకాటకు తగలేయ కుండా సంసార ఖర్చులకు ఉపయోగిస్తున్నాడు.

పిల్లలకు బట్టలకు, నగలకు, చదువుకు, ఇంటి ఖర్చులకు వచ్చిన శాలరీ జమైపోతున్నది.అంతక్రితం అతనికున్న అలవాట్లవల్ల ఇల్లుగడవటం కష్టంగానే వుండేది. ఇప్పుడు ఆమె పెన్షన్ ఆసుపత్రి ఖర్చులకు, మందులకు సరిపోతున్నది. రూపాయి నిలువలేదు. నేను ఏం చేసేది అని కొద్ది రోజులుపోయాక అంగలార్చాడు యతిరాజులు. కాని బిందు మాత్రం ఒక్కో నెల ఖర్చు ఎక్కువైతే ఏం చేయగలదు గనుక మధ్య తరగతి జీవితాలు మనవి అని భర్తకు సర్దిచెప్పేది.

❖ ❖ ❖

అనుకోకుండా ఒకరోజు సరళ ఇంట్లో ఫంక్షన్ జరిగితే తప్పనిసరై బిందు ఆమె ఇంటికి పేరంటానికి వెళ్ళాల్సొచ్చింది. అప్పటికే బిందు లైట్‌గా గుండె నొప్పితో లోలోపల బాధపడసాగింది. భోజనం చేసిన కొద్దిసేపటికే ఆమెకు ఊపిరందక ఒకచోట కుప్పకూలిపోయింది.

హార్ట్ బీట్ స్లో అయ్యి వళ్ళంతా చెమటలు పట్టేసాయి. ముఖం మీద నీళ్ళు చల్లిన సరళ చెవిలో బిందు విషయం చెప్పింది. ఆలస్యం చెయ్యకుండా సరళ మిగిలిన కార్యక్రమాన్ని మరదలికి అప్పజెప్పింది. బిందుని ఆటోలో పాత కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకు చక్కా పోయింది.

లక్కీలీ కార్డియాలజిస్టు రౌండ్స్ ముగించుకొని ఎక్కడికో క్యాంపుకెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు.ఆలస్యం చెయ్యకుండా నర్స్‌ని, కాంపౌండర్‌ని ఆమెను ఐ.సియులో పెట్టి ఆక్సిజన్ సిలెండర్ తగిలించమని లోనికెళ్ళి అన్ని ప్రాథమిక పరీక్షలు సక్రమంగా నిర్వహించాడు. అవసరం అయితే హార్టుకి ఆపరేషన్ చెయ్యాల్సొస్తుంది. అరగంటలో ఇంకా రిపోర్ట్సు ఒకటి రెండు తెలుస్తాయి. లక్షన్నా డబ్బు రెడీ చేసుకొని ఉండండని సరళకు చెప్పాడు.

అదే విషయం యతిరాజులకి ఫోన్ ద్వారా చెప్పింది సరళ. వెంటనే కూడా తెచ్చిన పదివేలు కౌంటర్‌లో ముందుగా కట్టేసింది సరళ.

పిల్లలిద్దర్నీ తీసుకొని శేర్ కొట్లో లక్షరూపాయలు అప్పుకు ప్రోనోట్ వ్రాసి ఇంటి దస్తావేజులు తాకట్టు పెట్టి యతిరాజులు ఆసుపత్రికి బయలుదేరాల్సి వచ్చింది. ■

## 'బోఫోర్స్' వంటి 'ఫార్స్!'

పురస్కారాల ప్రహసనం
వెర్రితలలు వేస్తున్నది
వేలంవెర్రి రూపుదిద్దుకుంటున్నది!
ప్రతిభకు పట్టం కట్టుట మరచి
'ఓ.న.మః' స్టేజిలోనే
పురస్కారాల కొరకై పరుగు!
సంస్థలు... సమాజాల
తీరూ ఇలాగే వుంది!
డబ్బివ్వగలవాడు దొరికినచాలు
వాడినెత్తికి కుచ్చులటోపీ!
ప్రకటనలకు ఆకర్షితులై
కోరినంత ఎదురిస్తామంటూ
వేటలో ఛేజింగు!
దాతలకు గ్రహీతలకు
ఇది గిట్టు 'బాటే' మరీ
విలువలు కోల్పోతున్న క్షణాలు!
పురస్కారాల కోసం
బిరుదుల కోసం
ఆరాటం... ఎదురు చూపులు
ఆశ్రయింపులు... ఇకిలింపులు!
తాము 'నన్నయో'... 'తిక్కనో'
'కాళిదాసో...' 'రామలింగ'డోని
వుబ్బిపోయే రోజులివీ.
ఆకాశమంత ఎత్తు
ఎదిగేమనే అహం ఆవహిస్తుందీ
బిరుదుల ప్రదానం సైతం
బిస్కెట్ల పంపిణీలా తయారైందీ
విమర్శలకు తావీయక
ఆత్మవిమర్శ చేసుకొనుట వాంఛనీయం!
పురస్కారాలు... బిరుదుల ప్రదానంపై
పలువిమర్శలు సర్వే సర్వత్రా విన్పిస్తున్నయ్!
ఇవి చివరకు 'ఫార్స్'గా మారరాదు!!

ఎస్. వివేకానంద